

# కలిసి బ్రతుకుదాం

ఆలూరి విజయలక్ష్మి

'చంద్రా! ఎవరో అబ్బాయి వచ్చాడు నీకోసం' పుస్తకం ముందు పెట్టుకుని ఆలోచనలలో నిమగ్నురాలైన చంద్రను చూచి విసుక్కుపోయింది విమల. అబ్బాయిలతో అతి ముక్తసరిగా మాట్లాడే చంద్రను వెదుక్కుంటూ ఓ అందమైన యువకుడు రావడం, చదువును ఓ తపస్సులా భావిస్తూ ఒక్క క్షణంకూడ వృధా చెయ్యని చంద్ర పుస్తకం ముందుపెట్టుకుని కలల్లో తేలిపోవటం చిత్రమనిపించింది విమలకి.

'విమలా! ఒక్క రెండు నిమిషాలు. అతనితో మాట్లాడుతూ వుండు అంతవరకు.' ఏదో సమస్యతో మధనపడుతున్న చంద్రను చూచి హృదయంలోని ప్రతి కదలికను తన ముందుంచే ఈ అమ్మాయి క్రొత్తగా తననుండేదో దాస్తుందని గ్రహించింది విమల.

'అతన్ని నీ కోడలు ఎంగేజ్ చెయ్యగలవులే. నేను కాఫీ పెడతాను. త్వరగా రా నువ్వు.' శ్రీ కృష్ణానగర్‌లో పొడుగ్గా వున్న బిల్డింగ్‌లో ఓ రెండు గదుల పోర్షన్‌లో విమల కాపురం, ప్రక్కనేవున్న ఒక్కగది పోర్షన్‌లో చంద్రకళ బస. యూనివర్సిటీ ఫార్మసీ డిపార్ట్‌మెంట్‌లో లెక్చరర్‌గా వుంటూ రిసర్చిచేస్తున్న చంద్రకళ అగ్గిపెట్టెలాటి ఈ గదిలో చేరిన పది రోజుల్లోనే ప్రక్కపోర్షన్‌లో వుంటున్న ఫిజిక్స్ లెక్చరర్‌భార్య విమలకు ఆప్తురాలయింది.

చీర మార్చుకుని, బొట్టు సరిచేసుకుంటున్న చంద్రకు అతనితో మాట్లాడుతున్న 'స్వప్న' ముద్దుమాటలు వినిపిస్తున్నాయి. మరో నిమిషంలో రూమ్‌కు తాళంవేసి విమల వాళ్ళముందు రూమ్‌లోకి వచ్చి 'నమస్తే' అంది చంద్ర. చిరునవ్వుతో చేతులు జోడించాడతను. స్వప్న అతని ఒడిలోనుండి దూకివచ్చి ఎత్తుకోమన్నట్లు చేతులు చాచింది.

'మా బంగారు తల్లినికదూ! యిప్పుడు ఎత్తుకోను నిన్ను. నాచీర కాస్తా నలిపి పారేస్తావు' అంది చంద్ర 'స్వప్న'ని ముద్దు పెట్టుకోవడానికి ముందుకు వంగి. 'ఛో! నీకు ముద్దియ్యను. అత్తయ్య చెడ్డ. అంకుల్ మంచి' అంది స్వప్న బుంగమూతి పెట్టి. గలగలా నవ్వుతూ స్వప్నను ఎత్తుకుని ఒళ్ళో కూర్చోబెట్టుకున్నాడతను.

'మీకేదో తైర్ వేస్తున్నట్లుందే అమ్మగారు' అంది విమల అతని ముందున్న టీపాయ్‌మీద కాఫీ కప్పులు వుంచుతూ.

'వీరు కెమిస్ట్రీ డిపార్ట్‌మెంట్‌లో లెక్చరర్. ప్రభాకర్. ఈవిడ ఫిజిక్స్ డిపార్ట్‌మెంట్‌లో లెక్చరర్ మధుసూధనరావుగారి మిసెస్—విమల.' పరిచయాలు పూర్తిచేసింది చంద్ర.

కాఫీ సిప్‌చేస్తూ ప్రభాకర్‌నీ, చంద్రనీ గమనిస్తూంది విమల. చంద్ర దీర్ఘాలోచనలో మునిగివుంది. స్వప్నతో కబుర్లు

చెప్తూ కాఫీ త్రాగుతున్నాడతను. కాఫీ త్రాగడం ముగించి చంద్రవంక చూసాడతను.

'విమలా! నేనొ గంటా, గంటన్నరలో వస్తాను.' స్వప్న చంకకు తగిలించుకున్న వ్యానిటీబాగ్‌ను తీసుకుని లేచింది చంద్ర.

'వస్తానండీ!' చేతులు జోడించాడతను. పొడుగ్గావున్న వరండాలో ప్రభాకర్ వెనుక వెళ్తున్న చంద్రను చూస్తూ నిలబడి పోయింది విమల.

'చంద్రా! ఒక్కమాట' హటాత్తుగా జ్ఞాపకం వచ్చినదానిలా పిలిచింది విమల.

'మీ అన్నయ్య 'ఫస్ట్‌షో'కి చిత్రాలయలో టికెట్స్ తీస్తానన్నారు నువ్వు స్ట్రైట్‌కి వచ్చేయగలవా?' ప్రభాకర్‌కి వినపడకుండా చిన్నగా అడిగింది విమల.

'వచ్చేస్తాను. ఒకవేళ ఆలస్యమయితే హాల్‌కు డైరెక్ట్‌గా వచ్చేస్తాను.'

'సరే, వెళ్లిరా!' తనలో ఎన్నో సందేహాలున్నా, ఎంతో సహజంగా తనను సాగనంపుతున్న, పెద్దగా చదువుకోని, విమల సంస్కారానికి మరోసారి ముగ్ధురాలయింది చంద్ర.

యూనివర్సిటీ లేడీస్ హాస్టల్‌మీదగా బీచ్‌కి వచ్చారు ప్రభాకర్ చంద్ర. ప్రక్క ప్రక్కగా నడుస్తున్నా ఒకరిఉనికినిమరొకరు విస్మరించి ఎవరి ఆలోచనల్లో వాళ్లున్నారు. సముద్రంమీదినుండి చల్లని గాలిపిలలు మెల్లగా వచ్చి పలుకరించగానే తనలోని సంఘర్షణను చాలవరకు మరిచిపోయింది చంద్ర. బంగారుతీగెలు పరిచినట్లున్న సముద్రాన్ని, సముద్రం, ఆకాశం కలిసిన చోట లీలగా కనిపిస్తున్న షిప్‌నీ చూస్తూ నిలబడిపోయింది చంద్ర

'చంద్రకళగారూ!' ఏదో స్వప్నంలో నుండి బయటకు వచ్చినట్లు తలెత్తి అతని వంక చూచిందామె

'యిక్కడ కూర్చుందామా?' అంగీకార సూచకంగా తలఊపి మెరుస్తున్న యిసుక తిన్నెమీద కూర్చుంది. కొద్దిదూరంలో అతను రుమాలు పరుచుకుని కూర్చున్నాడు.

'మేడమ్!' చంద్రవైపు చిలిపిగా చూసాడతను.

'ఏమిటండీ మాస్టారూ?' యిసుకలో పిచ్చిక గూళ్ళు కడుతున్న చంద్రకళ ఓరగా చూచిందతనివంక.

'కొన్ని డౌట్స్‌వున్నాయి మేడమ్! అవి తీరుస్తారేమోనని...'

'సరి! నేనింకా పాఠాలు చెప్పడానికి రమ్మన్నారేమో ననుకున్నా' ఆమె కళ్ళల్లోని మెరుపును గమనించాడతను.

'నిజం?' చటుక్కున ఆమె చేతినందుకొని మృదువుగా చుంబించాడతను. అతని స్పర్శ ఆమెలోని స్త్రీత్వాన్ని తట్టిలేపింది. ఆనందము, బాధ కలిసిన ఒక విచిత్ర స్థితి ఆమె నావహించింది. 'ఏమిటీతని ధైర్యం' అనుకుని ఆశ్చర్యపోయింది.

'ఏమిటిది?' చురుగ్గా చూసిందతని వైపు.

'పాఠాలు చెప్తున్నారుగా మరి?' కొంటెతనం తొంగిచూచిందని కళ్ళల్లో.

'బావుంది' కోపంతో ముఖం త్రిప్పుకుంది చంద్ర.

'నిజం?! బావుందా!' ఆమెచేతి నందుకున్నాడతను. కోపంతో అతని చేతిలో చిక్కుకున్న తన చేతిని విడిపించుకోవడానికి ప్రయత్నించింది చంద్ర. చిగురుటాకులా వణికిపోతున్న ఆమె చేతిని ఆప్యాయంగా నిమిరాడు ప్రభాకర్. అతని స్పర్శ తాలూకు మాధుర్యం ఆమెను వివశురాల్ని చేస్తూంది.

'మీరిలా ప్రవర్తిస్తారనుకుంటే మీ వెంట ఎప్పటికీ వచ్చేదాన్ని కాదు.' తన చేతిని విడిపించుకోలేని నిస్సహాయత, కోపం కలసి ఆమె ముఖానికి రోజారంగును పులిమాయి.

'కోపగించుకోకు చంద్రా!' దీనంగా చూసాడతను.

'నేనకారణంగా కోపగించుకుంటున్నానంటారా? యింత చనువు తీసుకునే అధికారం ఎవరిచ్చారు మీకు?' రోషంగా అడిగింది చంద్ర.

'మీరే!'

'నేనా?!' ధైర్యంగా తన కళ్ళల్లోకి సూటిగా చూస్తున్న అతనివంక విస్తుపోతూ చూచింది చంద్ర.

'కాక?! ఏ చనువు ఇచ్చే ఉద్దేశ్యం లేకుండానే, నేనడగగానే ఒంటరిగా నాతో బీచ్‌కు వచ్చేస్తారా? ఐదు సంవత్సరాల నుండీ మిమ్మల్ని గమనిస్తున్నాన్నేను. యూనివర్సిటీ కాంపస్‌లో ఏ అబ్బాయితోనైనా చనువుగా మాట్లాడడం దేవుడెరుగు, కనీసం ఒక మనిషితో మాట్లాడినట్లు మాట్లాడడం ఎప్పుడూ చూళ్లేదు నేను. 'పలకరిస్తే ఆ పిల్ల అలా కరుస్తుందేమిటిరా!' అని వాపోయేవారు నా ఫ్రెండ్స్. అలాటిది మీరు నాతో చక్కగా మాట్లాడి, అడగంగానే బీచ్‌కు వచ్చారుకదా, దీనికి నేనే అర్థం చెప్పుకోను? ఒకవేళ నేను అపోహపడి, కూడని చనువు తీసుకుంటే క్షమించవాలి నన్ను' అంతవరకు పదిలంగా పట్టుకున్న ఆమెచేతిని వదిలేసాడతను. ఏదో మహాసౌఖ్యాన్ని తననుండి బలవంతంగా లాక్కున్నట్లు భావించింది చంద్ర.

'అదికాదు. చుట్టూ ఎంతమంది వున్నారో చూడండి. ఎవరైనా చూస్తే!' మెల్లగా నసిగింది చంద్ర.

'ఎవరూ చూడకపోతే ఫరవాలేదన్న మాట. చెప్పవేంమరి!!' అందంగా నవ్వాడతను.

'ఫొండి యిలా మాట్లాడితే నేనిక్కడ ఒక్కక్షణంకూడ వుండను' మనోహరమైన సిగ్గుతెర ఆమెను కప్పివేసింది. ప్రక్కన పడివున్న వ్యానిటిబేగ్ తీసుకుని లేచింది చంద్ర. ఎప్పుడూ గంభీరంగా కనిపించే చంద్రలో క్రొత్తగా కనిపిస్తున్న సిగ్గును చూచి 'ఎప్పుడూ పుస్తకాలు, ఫస్ట్‌క్లాస్‌లు, యూనివర్సిటీ ఫస్ట్‌లు అని జపంచేసే యీ పిల్లలో కమ్మని కలలు రేపడంతో తను కృతకృత్యుడయాడా?' అని ఆలోచిస్తున్న ప్రభాకర్ లేచి వెళ్లిపోతున్న చంద్ర కొంగును అందుకోగలిగాడు.

'ప్లీజ్ చంద్రా! యీ రోజు నీతో ఎన్నో మాట్లాడాలని, ఏదో ఒక నిర్ణయం చేసేసుకోవాలని వచ్చాను. కొంచెంసేపు కూర్చో' ప్రతిమాలుతున్నట్లు చూసాడతను,

'మీరు అల్లరి చెయ్యకుండా బుద్ధిగా కూర్చుని మాట్లాడతానని ప్రామీస్‌చేస్తే తప్ప నేను కూర్చోను. యిలాటి చేష్టలంటే నా కసహ్యం.' అంటూనే కూర్చుంది చంద్ర.

'ఎలాంటి చేష్టలంటే చంద్రా!' కొంటెగా నవ్వాడతను. ఆడపిల్లల్ని వశపరచుకోవడానికి యీ మొగవాళ్ళు ఎంత అందమైన అస్త్రాలు ప్రయోగిస్తారబ్బా! అనుకుంది చంద్ర.

'అందంగా ఆత్మవంచన చేసుకోవడంలో ఏ ఆడపిల్లలది అందెవేసిన చెయ్యో

అన్నాడు ప్రభాకర్.

'ఆత్మవంచనా?!'

'కాక మరేమిటండీ! యిప్పుడు నేను చేసిన చేష్టలవల్ల మీకు కలిగింది ఆనందమా, లేక అసహ్యమా?' అతనంత సూటిగా, పచ్చిగా మాట్లాడుతోంటే ఒక్క క్షణం నోరు విప్పలేక పోయింది చంద్ర.

'యిదిగో యిలా అంతా ఆనందమయం అని నొక్కి వక్కాణించి ఆ భ్రమలో పీక లోతుకు మునిగిపోయే వరకు తీసుకు వెళ్లి ఆనక నిర్దాక్షిణ్యంగా తప్పుకు పోవడంలో మీ మగవాళ్లది అందెవేసిన చెయ్యికాదా?' సూటిగా చూచిందతని వంక.

'ఉహూ! మీకు సబ్జక్ట్ తప్పితే యిహ లోకంలో మరే మీ తెలియదనుకున్నానే! ఫరవాలేదయితే!' కళ్లు పెద్దవి చేసి ఆశ్చర్యంగా చూసాడతను.

'అదిగో! మళ్లీ మొదలు పెట్టారు.' అలుకగా చూచిందతని వైపు.

'లేదు. లేదు. బుద్ధిగా కూర్చుని మాట్లాడుతాను.' భయం నటించాడతను. మోకాళ్ల మీద తలానుకుని ఇంద్రధనుస్సులా వున్న బీచ్‌ని చూస్తూ కూర్చుంది చంద్ర.

'త్వరగా యింటికి కోడల్ని తేవాలని రెండు సంవత్సరాల నుండి అమ్మ పోరు పెడుతూంది.' తలవంచుకుని అతని పాయింటెడ్ షూసీ ఫోల్డ్‌లెస్ టెరీన్ పాంట్‌సీ చూస్తూంది చంద్ర.

'అప్పట్నుండి నా ఆలోచనల్నీ, అనుభూతుల్నీ పాలుపంచుకోగల అమ్మాయి కోసం వెతుక్కుంటున్నాను.' ఓ క్షణం ఆగాడతను. 'ఆ అమ్మాయి తనేనా!' ఓ క్షణం ఝల్లుమంది ఆమె హృదయం.

'పెళ్ళి ప్రస్తావన చేసేముందు, నా గురించి, వివాహం గురించి మీ అభిప్రాయాలు తెలుసుకోవాలని మిమ్మల్నిలా రమ్మని కోరాను. అదృష్టవశాత్తూ అడగంగానే మీరు ఒప్పుకోవడం ఓ వరంగా భావించాను.'

'నాదొక ప్రశ్న.' తలెత్తి అతని చూపుల్లో చూపులు కలిపిందామె.

'తప్పకుండా. మీ ప్రశ్నలకు జవాబులిచ్చి మీ నుండి నా ప్రశ్నలకు సమాధానం పొందాలనే నేను మిమ్మల్నిక్కడికి రమ్మని కోరింది', అతనిలోని

# కలిసి బ్రతుకుదాం

గంభీరతను చూచి యింతకు మునుపింత చిలిపిగా ప్రవర్తించిందితనేనా అనుకుంది చంద్ర.

'మీరంటే పడి చచ్చిపోయే అమ్మాయిలు చాలమంది తెలుసు నాకు. మీ తెలివినీ, టాలెంట్స్‌నీ, ఫిగర్‌నీ ఆరాధించే అమ్మాయిలు నా ఫ్రెండ్స్‌లోనే వున్నారు. వాళ్లందర్నీ కాదని, వాళ్ళతో పోలిస్తే ఏ ఆధిక్యతా లేని నాముందు మీరు పెళ్లి ప్రస్తావన తెస్తున్నారంటే నాకెంతో ఆశ్చర్యంగా వుంది.'

'బహుశా యీ నిరాడంబరతనే యిష్టపడ్డాననుకుంటాన్నేను. ఆత్మవిశ్వాసాన్ని అభినందిస్తాను కాని అహంకారాన్ని అసహ్యించుకుంటాన్నేను. బహుశా యీ కారణంవల్లే వాళ్లెవరూ నామనసుకు దగ్గరగా రాలేక పోయారేమో! మిమ్మల్ని చూచిన క్షణంనుంచీ మిమ్మల్ని ప్రేమిస్తున్నానని, మిమ్మల్లో దేవతలా చూచుకుంటానని అనన్నేను. మీమీద యీ ఆప్యాయత ఒక్కనాడు ఉధృతమైన వరదలా వయసు వేడిలో వచ్చింది కాదు, ఎన్నోరోజుల్నుండి, కాదు సంవత్సరాల్నుండి నాలో నిదిగి క్రమక్రమంగా నాలో పూర్తిగా నిండిపోయింది' అతనిమాటలు వింటూంటే తనని తాను ఒక్కసారి పరిశీలించుకోవాలనిపించింది చంద్రకు. అతనిముందు పొట్టిగా, పీలగా కనిపించే తనలో ఆకర్షించేవి రోజా రంగు, సూటిగా మొనతేలినట్లుండే ముక్కూ. భుజం దిగని నొక్కుల నొక్కుల జుట్టూ, అమితమైన కాంతితో ప్రకాశించే చిన్నకళ్లూ.

'మీ సెంటిమెంట్స్‌ని, మీ ఆశయాల్ని గౌరవిస్తూ నన్ను చేసుకున్నందుకు మీరు పశ్చాత్తాపపడే అల్పమైన క్షణం రాకుండా వుండేలా ప్రయత్నిస్తాను.' తెలియచెప్పలేని ఉద్వేగంతో కరిగిపోతూంది చంద్ర.

'నేను తప్పితే నా చుట్టూవున్న పరిస్థితులు తెలీవు మీకు' అంది నెమ్మదిగా చంద్ర.

'నాకు కావలసింది మీరు.'

'మిమ్మల్ని కొనివ్వగల తాహతు లేదు మా నాన్నగారికి.'

'యిక్కడ కొనుక్కోవడం, అమ్ముకోవడమనే ప్రసక్తేలేదు చంద్రా! కలిసి బతికే దానికి ఒకరి అనుమతి మరొకరం తీసుకోవడమే.'

'కొంతకాలంవరకు నా డబ్బు మనకోసం ఖర్చుపెట్టలేను.'

'నా క్కావలసింది మీరుకాని మీరు సంపాదించే డబ్బు కాదు.' యిదేమిటి తను! నాక్కావలసింది నీ డబ్బుకాని నువ్వు కాదంటున్నాతే యీనాటి యువకుల్లో మెజారిటీ! స్కూటర్లు. కార్లు, అందమైన ఫ్లాట్‌లు, ఫారిన్ ట్రిప్స్; థ్రిల్ కలిగించే క్లబ్బు సందళ్ళు — వీటి మీద ఆసక్తి లేదా యీ అబ్బాయికి.

'చంద్రా! యింక మీరు చెప్పండి. మీరు పెళ్ళాడబోయే వ్యక్తి గురించి, దాంపత్య జీవితం గురించి మీ అభిప్రాయాలేమిటి? మీ ఆలోచనల్ని విని అందుకు నేను తూగ గలనా అనీ విమర్శించుకుని ముందుకు సాగుతాను' అన్నాడతను. మౌనంగా ఆలోచిస్తూంది చంద్ర.

'మాట్లాడరేం చంద్రా!'

'ఏం మాట్లాడను! సంసారం గడవడమే కష్టంగా వున్న పరిస్థితుల్లో ఎదురొడ్డి నన్ను చదివించారు నాన్న కేవలం సరదా కోసం, లేక పెళ్లయ్యే వరకు ఊరికినే కూర్చోలేక యూనివర్సిటీకి వస్తే బహుశా మిగిలిన అమ్మాయిలానే వుండే దాన్నేమో! వయసులో వున్న కన్నెపిల్లల్ని ఎలాటి ప్రలోభాలు నాశనం చేస్తాయో కొంతవరకు తెలుసు నాకు. కొన్ని పరిస్థితుల్ని కొనితెచ్చుకొని వాటినుండి బయటపడేదెలా అని బాధపడే కంటే అసలా పరిస్థితులు రాకుండా చూసుకుంటే పోలా! అంచేత నా చుట్టూ కొన్ని పరిధులుంచుకున్నాను. వాటిని దాటకుండా వుండడానికి అతిజాగ్రత్తగా మెలిగాను. అంచేతే మీ ఫ్రెండ్స్‌లాంటి వాళ్ళ దృష్టిలో నేనో గయ్యాళి గంపనయ్యాను.' చిన్నగా నవ్వింది చంద్ర. 'చెప్పండి' అన్నట్టు చూసాడు ప్రభాకర్.

'నిజానికి మా విమలతో స్నేహమయ్యే వరకు నేను వివాహమంటే విముఖంగా వుండేవాన్ని. అబ్బాయిల గురించి మాట్లాడుతూ, ఏవేవో ఊహించుకుని, నిట్టూర్పులు విడుస్తూ చదువును అశ్రద్ధ చేసే నా ఫ్రెండ్స్‌ని చూచి విసుక్కునేవాన్ని,

కాని నా విమల నన్ను కొద్దికొద్దిగా మార్చేసింది. విమల దాంపత్యం చూస్తుంటే నాలో ఒక భాగం అసంపూర్తిగా వున్నట్లు ఫీలవుతాను స్వప్నను హృదయానికి హత్తుకుంటే 'నాకూ ఓ బుల్లి పాపాయి వుంటే!' అనిపిస్తుంది.' చంద్ర కళ్ళల్లోని భావుకత్వాన్ని రెప్పవేయకుండా చూడసాగాడు ప్రభాకర్.

'కాని ... నాలో ఎన్నో అస్థిరమైన భావాలు. ఒకదానికి మరొక దానికి పొత్తు వుండదు. నేను బాగా పట్టుదలతో రిసర్చి చేసి దేన్నో సాధించి తీరాలి. నా ప్రొఫెషన్‌లో పైపైకి, అత్యున్నత స్థానానికి వెళ్ళాలి. ప్రతి క్షణాన్ని విజ్ఞాన సముపార్జనకి వెచ్చించాలి. నా మేధస్సును నలుగురికి ఉపయోగపడేలా చెయ్యాలి అంతలోనే యీ భావం ఫేడౌట్ అవుతుంది. 'నీ ఆశలూ. అనుభూతులూ, సమస్యలూ నావి. నువ్వు నిశ్చింతంగా వుండు' అనగలిగిన పురుషుడి హృదయంమీద విశ్రాంతి తీసుకోవాలనిపిస్తుంది చిన్నారి పాపల ముద్దుపలుకుల్లో మైమరచి పోవాలి. అందమైన సాయంత్రాల్లో ఒక పాపను నా ఒళ్ళోనూ, మరో బాబును ప్రక్కనే కూర్చోబెట్టుకుని ముందువుంచి స్కూటర్ మీద షికారెళ్ళాలి. నా బిడ్డలికి గోరు ముద్దలు నేను తినిపించాలి. వాళ్ళకి రకరకాల డిజైన్స్‌లో డ్రెస్‌లు కుట్టాలి. వాళ్ళ చేత అక్షరాలు నేను దిద్దించాలి. చిత్రమేమిటంటే పరస్పర విభిన్నమైన యీ కోర్కెలు రెండూ సమానమైన బలంతో వున్నాయి. వీటిల్లో దేనినీ నెట్టివేయలేకుండా వున్నాను.' ఆమె మాటల్లోని సిన్సియారిటీ అతని మీద బలమైన ముద్ర వేసింది. మరో లోకంలో వున్నట్టు చెప్పుకుపోతూ వుందామె.

'రెంటినీ సాధించాలంటే నాకీ జీవితం చాలదు. ఏదో ఒకదాన్ని ఎన్నుకుందామంటే రెండోదానికోసం జీవితాంతం పశ్చాత్తాప పడతానేమోనని భయం వేస్తుంది' విషాదం తొంగి చూసిందామె స్వరంలో.

'చంద్రా!' ఆమె చుబుకాన్ని పట్టుకుని తనవైపుకు త్రిప్పుకున్నాడు.

'రెంటినీ సమన్వయ పరచుకోవడానికి ప్రయత్నించండి. నా చేతయినంతవరకు నేను మీతో సహకరిస్తాను.' దృఢంగా వుందతని స్వరం.

'ఒకోసారి ప్రతిదాన్ని ఎందుకింత సీరియస్‌గా తీసుకుంటాను! అని మథన పడతాను. లోకంలో నాలానూ, నాకంటే ఎక్కువ చదివినవాళ్ళు చాలమంది వున్నారు. వాళ్ళు నాలాకాకుండా హాయిగా నవ్వుతూ, త్రుళ్ళుతూ ఎలా గడిపేయగల్గుతున్నారు!. తాము చదివింది అభివృద్ధి పరచుకోకుండా, కనీసం నలుగురికి వినియోగపరచకుండా ఎలా వుండగలుగుతున్నారు! అని ఆశ్చర్య పోతాను. ఇంత అస్థిరమైన ఆలోచనలతో వున్న నేను దేన్నీ పొందలేనేమో, దేన్నీ సాధించలేనేమోనని అధైర్యపడిపోతాను' చంద్రకళ్ళు నీళ్ళతో నిండిపోయాయి.

'చంద్రా!' నలువైపులా అలుముకుంటున్న చిరుచీకట్లలో తన కౌగిలిలోకి తీసుకుని ఓదార్చాడతను. కర్చీఫ్‌తో ఆమె కళ్ళు తుడిచాడు.

'చంద్రా! జీవితంలో దేనికివ్వాల్సిన ప్రాముఖ్యం దానికివ్వాలి. చదువు జీవితాన్ని వ్యక్తిత్వాన్ని అలంకరింప చేసేలా వుండాలి కాని ఓ గుదిబండ కాకూడదు.' అతని మాటలు వింటూ, అతని కౌగిలిలో వివశురాలైన చంద్ర ఒక్కసారి ఉలిక్కిపడింది. 'ఏమైపోతూంది తనకు! యింత తేలికగా యితనికింత చేరువగా ఎలా రాగలుగుతూంది. ఊహూ. తన పరిధుల్ని తప్పడమంత ఉచితం కాదు' నెమ్మదిగా అతని చేతుల్లోనుండి విడివడి తన చెక్కిళ్ళమీద మంచిముత్యాల్లా జారుతున్న కన్నీటిని తుడుచుకుంది.

'విమల ఎదురుచూస్తూ వుంటుంది. వస్తానింక' అతని పాదాల దగ్గరున్న వ్యానిటీబాగ్ నందుకుని లేచింది.

'చంద్రా!' ఆమె చేతిని మృదువుగా అందుకుని లేచాడు.

'నువ్వు ఆలోచించుకుని ఓ నిర్ణయానికి వచ్చి నాకు చెప్పు. ఒకవేళ నీ నిర్ణయం నేను కోరుకున్నట్లు లేకపోతే, నేను బాధపడనని, చెప్పనుకాని, మంచి స్నేహితులుగా మిగులుదాం.' ఆమె తన కోరికను నిరాకరిస్తుందేమోననే భయం ధ్వనించిందతని స్వరంలో. ఆమె తప్పించుకు వెళ్ళిపోతుందేమో అన్నట్లు ఆమె చేతిని విడవకుండా పదిలంగా పట్టుకుని నడుస్తున్నాడతను. అప్పుడే నలుదిక్కులా పరుచుకుంటున్న వెన్నెల పసిపాప బోసినవ్వులా పలుకరించిందా యిరువురినీ.


'ప్రభాకర్‌గారూ! మీరు నాకిస్తున్న స్థానం విలువ తెలుసు నాకు. యీ విలువను దృష్టిలో వుంచుకునే ఆలోచిస్తాను. మిమ్మల్ని గురించి ఆలోచించాల్సిందేమీ లేదు. నన్ను అంచనా వేసుకుని నిర్ణయం తెలియజేస్తాను మీకు. ప్రక్క ప్రక్కగా కదులుతున్న తమ నీడల్ని గమనిస్తూ అంది చంద్ర.

'మరి వస్తాను. అదిగో బస్ వచ్చింది' అప్పుడే ఆగిన బస్‌వైపు త్వరత్వరగా నడుస్తున్న చంద్రని అనుసరించాడతను.

* *

'చంద్రకళగారూ!'

'యస్' ఫేకల్టీ క్లబ్ ప్రక్కగా పరధ్యానంగా నడుస్తున్న చంద్రకళ తలెత్తి



చూచింది. తన ప్రక్కగా నడుస్తూ చిరునవ్వుతో తనను చూస్తున్నాడు ప్రభాకర్.

'మీ గురించే ఆలోచిస్తున్నాను' సన్నగా నవ్వింది చంద్ర.

'అదృష్టవంతుడిని' చిలిపిగా చూచాడతను.

'ఇంటికేనా ?'

'అవును. మీరూ రాకూడదూ? ఎప్పటి నుండో మిమ్మల్ని అమ్మకు చూపించాలనుకుంటున్నాను.'

'ఇప్పుడా ?!' నసిగింది చంద్ర.

'ఏం ? ఏమైనా పనుందా ?'

'పనేమీ లేదనుకోండి.'

'అయితే పదండిమరి. మీ కోడలు ఎదురు చూస్తూంటుందనా ?'

'నో. అదేం కాదు.' జిడ్డోడుతున్న ముఖం. నలిగిపోయినచీర. చేతిలో బరువైన ఫైల్—యీ వాలకంతోటా మొట్టమొదట సారి ఆవిడ కళ్ళబడడం! అనుకుంది చంద్ర. కాని ఈమాటే పైకి అంటే అతను నవ్వుతాడు. మరింక మాట్లాడలేక మౌనంగా అతన్ననుసరించింది చంద్ర.

'మీ రిసర్చివర్క్ ఎంతవరకు వచ్చింది?' బిగాణీ తీగల తివాచీని చూస్తూ అడిగింది చంద్ర.

'రిసర్చా ? అసలు చేస్తేకదా ఎంతో కొంతదూరం వచ్చేది ! మీరు ఇరవైనాలుగ్గంటలూ లేబ్‌లో కూర్చుని ఎలా పని చేస్తారోకాని నాకు వరసగా నాలుగుగంటలు లేబ్‌లో ఉండాలంటే ఊపిరి ఆగిపోయినట్టుగా వుంటుంది. అవునుగాని, చంద్రా! పట్టుదలగా వర్క్‌చేసేందుకు నాకేమన్నా మంత్రం ఉపదేశించరా ?'

'మంత్రమా ? ఉహూ. మంత్రాలేమీ రావు బాబూ నాకు.' చిత్రంగా కళ్ళు తిప్పింది చంద్ర.

'రావా?! ఒట్టిది. కొంతకాలం పోయాక రహస్యంగా ఉపదేశిస్తారు నాకు కదూ?!' గుసగుసగా మాట్లాడాడు ప్రభాకర్!

'ఇదిగో! ఇలా అయితే...?' తెచ్చిపెట్టుకున్న కోపంతో చూచింది చంద్ర.

'బాబోయ్! మూడోకన్ను తెరవకండి' నవ్వేశాడతను. అతని ప్రక్కన నడుస్తూ, అతనిమాటలు వింటూ చిత్రమైనహాయి ననుభవిస్తూంది చంద్ర. యూనివర్సిటీలో వస్తూ పోతూ తనతోటి లెక్చరర్స్‌తో

# కలసి బతకుదాం

మాట్లాడడం ఎన్నోసార్లు జరిగింది. వాళ్ళతో సబ్జక్ట్‌కాని, డిపార్ట్‌మెంట్ పాలిటిక్స్‌కాని మాట్లాడుతున్నప్పుడు తన స్త్రీత్వం ఎప్పుడూ గుర్తుకువచ్చేది కాదామెకు. ఎప్పుడూ యిలాంటి వివశత్వాన్ని పొందలేదు.

'అమ్మా! నేను చెప్పానా, చంద్రకళ అని. యీవిడేనమ్మా!' చేతులు జోడిస్తూ ఆమెను పరిశీలనగా చూచింది చంద్ర. తెల్లగా, బక్కపల్చగా వుందావిడ. ప్రశాంతంగా వున్న ఆమె ముఖం చూడగానే చెయ్యెత్తి నమస్కరించాలనిపించేలా వుంది.

'కూర్చోమ్మా!' తనకు దగ్గరగా పీట వాల్చి కూర్చోమందావిడ. చంద్ర బుద్ధిమంతురాల్లా పీటమీద కూర్చుని ఆవిడ కట్టుకున్న తెల్లటి మల్లు పంచెను చూస్తూంది. స్టౌ మీద ఉప్మా తయారు చేస్తూందావిడ.

'బాగా అలిసిపోయావనుకుంటానమ్మా! ముఖం కడుక్కుని దేముడి దగ్గర కుంకుమ వుంది పెట్టుకోమ్మా!' అందావిడ. తనను ఆశీర్వదించడానికి ఎవరో దేవత దిగివచ్చినట్లు ఆవిడ ముఖం వైపు చూస్తూంది చంద్ర.

'ఫైలు నలా భద్రంగా ఒళ్ళో పెట్టుకు కూర్చున్నారు; నిజంగా ఏమైనా మంత్రా



లున్నాయేమిటి దానిలో?' చంద్ర చటుక్కున ఒళ్ళో నుంచి ఫైలు తీసి అతని కందించింది.

'ఆ మంత్రాలేవో నేర్చుకోండి మరి' కోపంగా మూతి తిప్పింది. జీడిపప్పు తేవడానికి స్టోర్‌రూమ్‌లోకి వెళ్ళింది సుభద్రమ్మ, ప్రభాకర్ తల్లి.

'అవునూ... ఒక్క చదువు తప్పితే నీ బుర్రకేదీ అంటదనీ, ఇలాంటివేవీ తెలీవనీ అనుకున్నానే నేను?' సుభద్రమ్మకు వినిపించకుండా మెల్లిగా అడిగాడు ప్రభాకర్.

'ఎలాంటివి?' చెయిన్ హుక్‌లో చిక్కుకున్న జడను విడిపించుకోవడానికి ప్రయత్నిస్తూ, కనుకొలకుల్లోనుండి ప్రభాకర్‌ని చూచింది చంద్ర. 'యిలాంటివే. ఓరచూపులూ, పెదవి విరుపులూ, చెక్కిళ్ళలో రంగులూ యింకా...' అంటూనే ఆమె జడను హుక్‌నుండి తప్పించాడు ప్రభాకర్.

'స్టాప్' అంది చంద్ర సుభద్రమ్మ ఎక్కడ వస్తుందోనని భయపడుతూ.

'ఏమిటీ ? ఓరచూపులా, లేక ...' అంటూ వ్రేలితో ఆమె మెడమీద సున్నితంగా రాసాడతను.

'ఏం మగాళ్ళు బాబూ, కాస్త చనువిస్తే నెత్తికెక్కి కూర్చుంటారు.' ఖంగారుగా అతని చేతిని తోసేసింది చంద్ర.

'లేమ్మా! లేచి ముఖం కడుక్కునిరా. టిఫెన్ తీసుకుందురుగాని.' అంది సుభద్రమ్మ జీడిపప్పు నేతిలో వేయిస్తూ.

ముఖం కడుక్కుని, బొట్టు పెట్టుకుని వచ్చి సుభద్రమ్మ దగ్గరకూర్చుంది చంద్ర.

'ఎప్పుడూ ఆడపిల్లలమాటే ఎత్తని మా ప్రభ ఈమధ్య నీ గురించి చాలాసార్లు చెప్పాడమ్మా! వీడినీ, అమ్మాయిల్నిద్దర్నీ నాకు వదిలి దాటిపోయారు వీళ్ళ నాన్నగారు. నాకు చేతనయినంతలో వీళ్ళని వృద్ధిలోకి తెచ్చాను. ఆడపిల్లల్ని ఓ యింటివాళ్ళను చేసాను. వీడుకూడ తనకు నచ్చిన పిల్లను చేసుకుని, బిడ్డాపాపతో సుఖంగా వుంటే వాడిచేతిలో రాలిపోవాలని వుందమ్మా!' ప్లేట్స్‌లో ఉప్మా సర్దుతూ చెప్పింది సుభద్రమ్మగారు.

'ఏమిటమ్మా చెప్తున్నావు?' బట్టలు మార్చుకుని వచ్చి తను కూడ పీట వాల్చుకుని కూర్చున్నాడు ప్రభాకర్. ఉప్మా ప్లేట్ ఒకటి చంద్ర ముందుకు జరిపి

తలొకటి తీసుకున్నాడు.

'ఎక్కడెందుకు బాబూ యీ యిరుకులో. నీ రూమ్‌లో కూర్చుని తీసుకోండి. కూర పొయ్యిమీద పడేసి నేనూ వస్తాను' అంది సుభద్రమ్మ కూరకు తాలింపు వేస్తూ.

'పదండి మరి' మంచినీళ్ళ గ్లాసులు రెండూ తీసుకుని తనగదిలోకి బయల్దేరాడు ప్రభాకర్. ప్లేట్స్ తీసుకుని అతనివెనుక నడిచింది చంద్ర. టేబిల్ ముందున్న కుర్చీని మంచానికెదురుగా లాగి చంద్రకు కుర్చీ చూపించాడు. తను మంచంమీద కూర్చుని ప్లేట్ తీసుకుని తినడం ప్రారంభించాడు. అతని వెనుకగా కిటికీలో నుండి కన్పిస్తున్న గులాబీలను కనకాంబరాల్ని చూస్తూంది చంద్ర.

'ఉన్న కాస్త స్థలంలో మొక్కల బలే వేసారే?' అంది చంద్ర మెచ్చుకోలుగా చూస్తూ.

'వెయ్యడంవరకే నావంతు, వాటిని పెంచడం అమ్మవంతు. పెట్టుకునేవంతు ఎవరికొస్తుందో మరి' చంద్రవంక అర్థయుక్తంగా చూచాడతను.

చంద్ర మౌనంగా ఆలోచిస్తూ వుండిపోయింది.

'చంద్రా!' తన ఆలోచనలలో నుండి తెప్పరిల్లి అతనివైపు చూచింది చంద్ర.

'మన విషయంలో ఏ నిర్ణయాని కొచ్చారు?' కుతూహలం తొంగి చూచిందతని స్వరంలో. చంద్ర టిఫెన్ ప్లేట్ టేబిల్‌మీద పెట్టి తన ఫైల్ విప్పి ప్రభాకర్ చేతికి ఓ కవర్ యిచ్చింది. ఆత్రుతగా విప్పి చూచాడతను. అది కామన్‌వెల్త్ స్కాలర్‌షిప్స్ స్కీమ్ క్రింద చంద్రకు కెనడాలో రిసర్చి చెయ్యడానికి స్కాలర్‌షిప్ యిస్తున్నట్లు తెల్పుతున్న కాగితం.

'విదేశాలకు వెళ్ళి రిసర్చి చెయ్యాలని, ఏదో సాధించాలని నేను కన్నకలలు ఫలించడానికి అవకాశం వచ్చింది ప్రభాకర్‌గారూ! నా ప్రయత్నం సక్సెస్ కావడానికి నా సర్వశక్తులూ వినియోగిస్తాను. నేను అనుకున్నది సాధించి తీరతాను.' కలలో వున్నట్లు మాట్లాడుతున్న చంద్ర ప్రభాకర్ ముఖం పాలిపోవడం గమనించలా. నేను ఒట్టి ఎండమావుల వెంట పిచ్చిగా పరుగెత్తడం లేదుకదా అనుకున్నాడు ప్రభాకర్.

'ప్రభాకర్‌గారూ! ట్రై చేస్తే మీకు కూడా అక్కడ జాబ్ దొరకొచ్చు. మనం వెంటనే పెళ్ళి చేసేసుకుందాం. నేనక్కడికి వెళ్ళాక మీకు ట్రై చేస్తాను. అక్కడ నా ఫ్రెండ్స్ యింకా కొంతమంది వున్నారు. వాళ్ళు కూడా మనకు సహాయం చేస్తారు.' ఉత్సాహంగా చెప్పుకుపోతూంది చంద్ర.


మహాభృంగరాజ్
శిరస్సును చల్లగా వుంచేందుకు
సాటిలేని గుణములను కలిగివున్నది.

భృంగాల్

మహాభృంగరాజ్ హెయిర్ ఆయిల్
కలకత్తా కెమికల్‌వారి నవీన
కర్మాగారంలో నిఖార్సయిన
ఆయుర్వేద ఫార్ములా ప్రకారం
తయారుచేయబడింది.

భృంగాల్

హెయిర్ ఆయిల భృంగరాజ్ ఆకుల
సారం, నువ్వుల నూనె మరియు
12 ఇతర ఆయుర్వేద దినుసులతో
కూడినది. ఇవన్నీ శిరస్సును చల్లగా
వుంచుతాయి. వీా శిరోజాలకు నూతన
సత్తువను చేకూర్చుతాయి.




ఖచ్చితమైన ఆయుర్వేద ఫార్ములా
ప్రకారం తయారుచేయబడింది.
భృంగాల్
సువాసనలీనే
మహాభృంగరాజ్
హెయిర్ ఆయిల్

CTC-15 TEL

# కలసి బ్రతుకుదాం

అయిపోయింది. ఈ అమ్మాయి తను అతి జాగత్తగా పేర్చి పెట్టుకున్న ఆశలన్నిటిని చెల్లాచెదురు చేసేస్తోంది.

'సారీ చంద్రా! ఫారిన్ రావడమనేది యిప్పట్లో జరగనిపని. నేను ఫారిన్ వచ్చేస్తే అమ్మ ఎక్కడుంటుంది?' జీవం లేనట్లుగా తనచేతిలోని కవర్‌ని టేబిల్ మీదుంచాడు ప్రభాకర్.

'అదేమిటి ప్రభాకర్‌గారూ! మీ అక్కలిద్దరున్నారు గదా! మీ. అమ్మగారు వాళ్లి ద్దరిలో ఎవరో ఒకరిదగ్గరుంటారు.' తేలిగ్గా తీసేస్తూ అంది చంద్ర.

'నో. అమ్మ ఎప్పటికీ అలా చేయదు. అమ్మ కూతుళ్ళ యింట్లో వుండదు. కొడుకు యిల్లు తనది, కూతురిల్లు పరాయిది అనే సాంప్రదాయాన్ని జీర్ణించుకు పెరిగింది అమ్మ.' ఈ అమ్మాయిని తను అర్థం చేసుకున్నాననుకున్నాడు. ఈ అమ్మాయి మిగతా అమ్మాయిలకంటె భిన్న మైనదని యింత అపురూపంగా తన జీవితంలోకి ఆహ్వానించాడు. వట్టిది. యీ అమ్మాయి మిగతావాళ్ళలానే స్వార్థపరురాలు. పెళ్ళయిన మరుక్షణం నుండీ భర్త తనవారితో బాంధవ్యాలన్నిటినీ తెంపేసుకుని కేవలం తన కొంగుపట్టుకు తిరగాలని వాంఛించే అతి సామాన్య యువతి.

'సిల్లీ. కూతురు, కొడుకు ఒకటే కన్నతల్లికి. యింకా యీరోజుల్లో యీ భావాలేమిటండీ!' నిర్లక్ష్యంగా అంది చంద్ర.

'ఈ భావాలు మీకు అర్థం కావులెండి. కఠినత్వం చోటు చేసుకుందతని స్వరంలో. ఓ నిమిషం ఎవరి ఆలోచనల్లో వాళ్ళున్నారు.

'చంద్రా!' మృదువుగా పిలిచాడు ప్రభాకర్.

'ఏమిటండీ!'

'నా కోసం మీ నిర్ణయాన్ని మార్చుకోలేరా? నేను ఎంతగానో అభిమానిస్తున్న మీ వెంట ఫారిన్ రావడానికి, మీ కోరికలు తీరడంలో సహాయం చెయ్యడానికి నాకు మాత్రం ఉత్సాహం వుండదనుకుంటున్నారా! కాని...నాకు ఊహతెలియకముందే మానాన్నగారు పోయారు. అమ్మ మమ్మల్ని ఎంత అపురూపంగా పెంచి పెద్దచేసిందో నాకు తెలుసు. మమ్మల్ని పైకితీసుకురావడంలో ఆవిడ ఎన్ని కష్టాలను తట్టుకుని నిల బడిందో నాకుతెలుసు. దానికి ప్రతిఫలంగా ఆవిడ పెద్దగా ఏమీ కోరుకోవడంలేదు. తన చివరి రోజులు నాదగ్గర గడపాలనుకుంటూంది. అమ్మ కోరిక తీర్చవలసిన బాధ్యత నామీద లేదంటారా? చెప్పండి చంద్రా!' అర్థిస్తున్నట్లున్న అతని కళ్లను చూడలేకపోయింది చంద్ర.

'మరోసారి ఆలోచించండి చంద్రా! ప్లీజ్!'

'నా బంగారు భవిష్యత్తుని మీ అమ్మగారి అర్థంలేని కోరికకు బలివ్వడం సబబే నంటారా ప్రభాకర్‌గారూ? మీరూ ఆలోచించండి. మీ ఆలోచనల్ని మార్చుకుంటే నేను సంతోషిస్తాను. మనముందు గొప్ప భవిష్యత్తువుంది. ఇలాటి బంధాల్నితెంచుకో లేకపోతే మనం అభివృద్ధిని సాధించలేం.' అంత స్పష్టంగా చెప్తోతున్న చంద్రవంక దెబ్బతిన్నవాడిలా చూసాడు ప్రభాకర్.

'ఆలోచించండి.' యింక యిదే ఆఖరు మాటన్నట్లుగా చంద్ర ఫైల్ తీసుకుని లేచింది.

'వెళ్ళొస్తానమ్మా!' అంది వంటింటి గుమ్మందగ్గరకు వెళ్లి. కాఫీ కప్పులు తీసుకు వస్తూంది సుభద్రమ్మ.

'కాఫీ తీసుకు వెళ్ళమ్మా!' అంది ఆవిడ. తన కొడుకు ప్రేమిస్తున్న యీ అమ్మాయి కొడుకు సుఖపడేలా చేస్తుందా! తనని ప్రేమగా చూస్తే మంచిదే. కాకపోయినా...తనకు బ్రతుకుతో రాజీపడడం అలవాటయిపోయింది. అన్నిటికీ తలవంచేసి ఎలాగో రోజులు వెళ్ళమార్చుకోగలదు. కాని తన కొడుక్కి సుఖశాంతులు లేకపోతే మాత్రం తను భరించలేదు.

'వస్తానండీ!' కాఫీకప్పు క్రింద పెడుతూ అంది చంద్ర.

'మంచిదమ్మా!'

గేటువరకు చంద్రను సాగనంపడానికి వెళ్లాడు ప్రభాకర్.

'యింక మీరాలోచించండి. రేపు సాయంత్రం బీచ్‌లో కలుద్దాం.' అతని చూపుల్ని తప్పించుకుని చకచక వెళ్లిపోయింది చంద్ర. సర్వం కోల్పోయినట్లుగా గేట్‌దగ్గర నిలబడిపోయాడు ప్రభాకర్.

* * *

పదవ నెంబర్ బస్‌లోనుండి దిగిన ప్రభాకర్ బీచ్‌లోకూర్చుని కబుర్లు చెప్పుకుంటున్న చంద్రకళ, విమల, స్వప్న, మధుసూధనరావులని చూచి అటు వచ్చాడు.

'హలో' అంటూ లేచాడు మధుసూధనరావు.

'రండి. కూర్చోండి' నవ్వుతూ ఆహ్వానించింది చంద్రకళ. ఆమె నవ్వు ముఖం చూచి తన ఆలోచనని మార్చుకుందేమోనని


## వధువు కావలెను

21 సం. కాపు (రెడ్డి), ఎరుపు రంగు, 5'—4", ఇంటర్ పాస్,కు సుమారు 18 సం: వ్యాపారస్థుల సుశీల కన్య కావాలి.

(ఇల్లరికానికి గూడా ఇష్టము)

పూర్తి వివరాలతో —

బాక్సు నెం. W/117,

C/o ఆంధ్ర సచిత్ర వారపత్రిక,

మద్రాసు—1.



## నిజం తెలుసుకో
## మంచిదారి ఎంచుకో

* 15 సంవత్సరాల నుండి వరుసగా ఏ యే పరీక్షలలో ఏ పేర్లు, నంబర్లు గల వారు పాసయినారు ?

* ఎన్ని హాస్టల్సు, ఎటువంటి లేబొరేటరీ వసతులు ?

* విద్యార్థుల తెలివి తేటలను సరియైన మార్గంలో మళ్లించటానికి ఏయే అవకాశా లున్నాయి? ఏ యే కోర్సు లున్నాయి?

* ఎవరిని చేర్చుకొనే అవకాశం ఉంది ?

* నిజం తెలుసుకోవాలన్నా, చేరి లాభం పొందా లన్నా ఒక కార్డు వ్రాయకూడదూ ?

సి. వి. యస్. ధన్, M.A.
డైరెక్టర్,

**రవి కళాశాల**

బ్రాడీపేట, గుంటూరు—2.

ఫోన్లు: 20917, 21192.

మెట్రిక్ క్లాసులు: జూన్ 12 నుండి.
మిగిలినవి జూలై 1 నుండి.

ఆశ కలిగింది ప్రభాకర్ కి.

'మా చంద్రకు స్కాలర్‌షిప్ వచ్చినందుకు క్వాలిటీ ఐస్‌క్రీమ్ తినిపిస్తాను పదండి' ఎప్పుడూ గలగలా నవ్వుతూ మాట్లాడే మధుసూధనరావు చూడగానే స్నేహపాత్రుడనిపిస్తాడు.

'బావుందండోయ్. స్కాలర్‌షిప్ వచ్చినందుకు పార్టీ ఆవిడ యివ్వాలికాని మీరివ్వడమేమిటి?'

'అన్నా చెల్లెళ్ళలో ఆ భేదం పొరపాటునైనా చూపించావంటే మనమీదకు దండెత్తి వస్తారండోయ్' అంది చిన్నగా నవ్వుతూ విమల.

ఐస్‌క్రీమ్ తిన్నాక మధుసూధనరావు దంపతులు ఓ ఫ్రండ్ యింటికి వెళ్ళాలని పిఠాపురం క్వార్టర్స్‌వైపు వెళ్ళిపోయారు. చంద్ర, ప్రభాకర్ రెస్టారెంట్ ప్రక్కనే నీళ్ళకు దగ్గర్లో వెళ్ళి కూర్చున్నారు.

'బాగా చలిగావుంది కదూ?' పమిట కొంగు భుజాలచుట్టూ కప్పుకుంటూ అంది చంద్ర.

'అవును' ఏదో ఒకటి మాట్లాడాలి అన్నట్లుగా అన్నాడు ప్రభాకర్: ఎవరికి వారు రెండవవారు తమ నిర్ణయాన్ని మార్చుకున్నారేమోననే ఆశతో వున్నారు—

'ప్రభాకర్ గారూ!' దూరంగా వున్న ఓ అందమైన జంటవైపుచూస్తూ దీర్ఘంగా ఆలోచిస్తున్న ప్రభాకర్ చంద్రవైపు చూచాడు.

'ఏమని నిర్ణయించారు?' ఓక్షణం మౌనంగా వుండిపోయాడు ప్రభాకర్.

'నా నిర్ణయం మీరు విన్నదే. మార్పేమీ లేదు. అమ్మను బాధపెట్టలేను నేను' విచారంగావున్నా, దృఢంగా అన్నాడు.

'అయితే... నేను నా నిర్ణయాన్ని మార్చుకోకపోతే అమ్మకోసం నన్ను వదులుకోవడానికి సిద్ధమేనన్నమాట, మీరు' నిష్ఠూరంగా అంది చంద్ర.

'సారీ చంద్రకళగారూ! నిజానికి మీ అనుమతి లేకుండా మీ మీద ఆశలు పెంచుకోవడం తప్పేనేమో! యిప్పటివరకూ నా సర్వస్వంగా భావించి ఊహల్లోనే కున్న నాకు యిక మీరేమీ కారనే ఊహరాగానే చాల బాధగా వుంది.'

'బాధేముందిలెండి. నాలాటి అమ్మాయిలు కోకొల్లలు. మీతో జీవితాన్ని పంచుకోవడానికి సిద్ధపడే అమ్మాయిలెంతోమంది వున్నారు.'

'ఉహూ. మీలాంటి వాళ్ళెంతోమంది వుండొచ్చు చంద్రా! కాని వాళ్ళంతా నాకు 'మీరు' కాదు' 'మీరు' అనే పదాన్ని వత్తి పలికాడు ప్రభాకర్. ఇప్పటివరకు 'నువ్వు' 'మీరు' లతో తంటాలుపడుతున్న ప్రభాకర్ 'మీరు' అంటానికి శతవిధాలా ప్రయత్నించడం గమనించింది చంద్ర.

'చంద్రా! నేను మీకు ప్రామిస్ చేసినట్లుగా మనం మంచి స్నేహితులంగా మిగలుదాం.' ఎంత ప్రయత్నించినప్పటికి గద్గదమయిందతని స్వరం.

'ప్రభాకర్ గారూ!' అతని భుజంమీద చెయ్యేసి నవ్వుతూ చూచింది చంద్ర.

'నేనింకా నా ఆఖరి నిర్ణయాన్ని గురించి చెప్పకుండానే అలా అంటారేమిటి? మనం మంచి స్నేహితులంగా మిగలడం కాదు, మనం మంచిదంపతులంగా నిలవడానికి ప్రయత్నిద్దాం. మీకో చిన్న పరీక్ష పెట్టాను. కామన్‌వెల్త్ స్కాలర్‌షిప్ వచ్చినప్పుడు మనసు కొంచెం ఊగిసలాడింది కాని మీ అమ్మను చూచాక, ముఖ్యంగా అమ్మకోసం మీరు నన్ను వదులుకోవడానికూడ సిద్ధపడ్డాక నా నిర్ణయాన్ని పూర్తిగా మార్చుకున్నాను. పూర్తిగా మీ జీవితంలోకి వస్తున్నాను. భార్యవచ్చిన మరుక్షణంనుండి భార్యకొంగు పట్టుకు వదలకుండా అంతవరకు తన ప్రాణంగా మెలగిన అమ్మ సెంటిమెంట్స్‌ను దెబ్బతీసే అబ్బాయిలంటే చిరాకు నాకు. అమ్మకోసం భార్యను నిర్లక్ష్యంచేసే మగవాడినైనా నేను భరించగలనేమోకాని భార్యకోసం అమ్మను నిర్లక్ష్యంచేసే మగవాడి నీడను కూడ భరించలేన్నేను. మీలాంటికొడుకును కన్న అమ్మ అదృష్టవంతురాలు. మిమ్మల్ని కని నాకిచ్చినందుకు అమ్మకు నేనెంతో ఋణపడి వున్నాను.' ఆపకుండా మాట్లాడుతున్న చంద్రవంక ఆశ్చర్యంగా చూస్తున్నాడు ప్రభాకర్.

'యూ సిల్లీ! ఎంత బాధపెట్టావు నన్ను' చంద్ర నెత్తిమీద ఒక్కదెబ్బ వేశాడు ప్రభాకర్.

'అమ్మతో నేను చేసేస్తానని చెప్పండి. అమ్మ చివరిరోజులు ప్రశాంతంగా గడవడానికి సహకరించి నా ఋణం తీర్చుకుంటానని చెప్పండి.'

'ష్యూర్ ష్యూర్.' నవ్వుతూ చంద్రను దగ్గరకు తీసుకున్నాడు ప్రభాకర్. ●

